## క్లుప్తంగా

### సర్వసభ్య సమావేశం వాయిదా

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి కోరం లేనందున వాయిదా వేశామన్నారు. మండల సర్వసభ్య సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

### సీసీరోడ్డు పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీ కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 31 సీసీరోడ్లు మంజూరయ్యాయన్నారు. ఈనెల 31లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం రింగన్‌ఘాట్‌లోని నర్సరీలో మొక్కలు పరిశీలించారు. సర్పంచ్ గుణవంత్‌రావు, సెక్రెటరీ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

### 'చలో శంకర్‌లొద్ది' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్‌నాయక్

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో సోమవారం 'చలో శంకర్‌లొద్ది' పోస్టర్‌ను సేవాలాల్ భక్తులు ఆవిష్కరించారు. సేవాలాల్ ఉత్సవ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 22న ఉగాది పర్వదినం పురస్కరించుకుని శంకర్‌లొద్దిలో మధ్యాహ్నం 12 గంటలకు భోగ్‌భండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రేంసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సర్పంచ్ శేషారావు, నాయకులు లాల్‌సింగ్, వెంకట్‌రాం, దేవ్‌జీ, తిరుపతి, భిక్కు, విజేశ్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా ఫేర్‌వెల్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు, పాఠశాల ప్రతినిధులు కోట వెంకన్న, ఉపాధ్యాయులు కృష్ణమాచారి, సదాశివ్, రమేశ్, నల్లగొండ రమేశ్, మహేశ్, వెంకట్రావు, సంతోశ్, మాతృమండలి సభ్యులు ఉమ, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సాక్షి సినిమాలు

**ఆసిఫాబాద్**
కుమురంభీం : బలగం

**కాగజ్‌నగర్**
వెంకటరమణ : బలగం

- ఆసిఫాబాద్అర్బన్

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.20 |
| సిమ్లామిర్చి | 60 |
| దోసకాయ | 40 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 30 |
| బీరకాయ | 60 |
| కాకరకాయ | 50 |
| బెండకాయ | 60 |
| అలసంద | 40 |
| దొండకాయ | 60 |
| పచ్చిమిర్చి | 50 |
| పాలకూర | 60 |
| సోరకాయ | 60 |
| చిక్కుడు కాయ | 30 |
| గోబి(పూల్) | 40 |
| క్యాబేజి | 40 |

-ఆసిఫాబాద్అర్బన్

# గడువులోగా పూర్తయ్యేనా..?

- 65 సీసీరోడ్లకు రూ.2.12 కోట్ల నిధులు మంజూరు
- ఇప్పటి వరకు 20రోడ్లు మాత్రమే పూర్తి
- ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- 13 రోజుల్లో పూర్తి చేయకుంటే నిధులు వెనక్కి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి: గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల అభివృద్ధికి మంజూరైన పనులు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. గ్రామాల్లో సీసీరోడ్లు, నూతన పంచాయతీ భవనాలు, డ్రెయినేజీలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. మరో పదమూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో గడువులోగా పనులు పూర్తి చేయకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోనున్నాయి. అయితే పనులు చేయడానికి కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపడం లేదు. గతంలో చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పెరిగిన సిమెంటు, ఇసుక, ఐరన్ ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించకుండా పాత ధరల ప్రకారంగానే అంచనా వ్యయం మంజూరు చేయడంతో గుత్తేదారులు వెనుకడుగు వేస్తున్నారు. రోడ్లు వేసేందుకు సమయానికి యంత్రాలు, కూలీలు దొరక్కపోవడం, సరిపడా నిర్మాణ సామగ్రి సైతం లభించకపోవడం కూడా కారణంగా తెలుస్తోంది.

**20 రోడ్లు మాత్రమే..**
మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద రూ.2.12 కోట్ల నిధులతో 65 సీసీ అంతర్గత రహదారులు మంజూరయ్యాయి. కాగా ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 20 సీసీ రోడ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. మరో నాలుగు రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరున ముగుస్తుండటంతో మంజూరైన రహదారులు గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. మరో పదమూడు రోజుల్లోగా మంజూరైన సీసీరోడ్లు పనులు ప్రారంభానికి నోచుకోకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి.

**జీపీ భవనాలు సైతం..**
మండలంలో 17 నూతన గ్రామ పంచాయతీలకు ఉపాధిహామీ పథకం కింద రూ.20 లక్షలతో పంచాయతీ కార్యాలయ భవనాలు మంజూరయ్యాయి. కాని వాటి నిర్మాణానికి ఇప్పటి వరకు పునాదులు పడలేదు. మంజూరైన పనులను పూర్తి చేసుకుంటే గ్రామాల్లో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల వాసులు పేర్కొంటున్నారు.

**పూర్తి చేయాలి**
మండలంలో మొత్తం 65 సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 20 రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి. గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు తెలియజేశాం.

- స్టీవెన్, పంచాయతీరాజ్ ఏఈ

## కంపు వాసన.. కళ్లకు మంటలు



మైనార్టీ గురుకుల పాఠశాల

- మైనార్టీ గురుకులం పక్కనే డంపింగ్ యార్డ్
- దుర్వాసనతో భోజనం సరిగా చేయలేని వైనం
- చెత్తకు నిప్పు వల్ల వచ్చే పొగతో అనారోగ్యం
- తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పాఠశాల సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డు

కాగజ్‌నగర్‌రూరల్: మైనార్టీ గురుకులం పక్కనే మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డు ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం కంపు వాసన వస్తుండడంతో విద్యార్థులు భోజనం కూడా సరిగా చేయడం లేదు. చెత్తకు నిప్పంటించడం వల్ల వచ్చే పొగతో కళ్లకు మంటలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

**తీవ్రంగా ఇబ్బందులు..**
మండలంలోని బలగల గ్రామ శివారులో మైనార్టీ గురుకుల 1, 2 పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. 2017 –18లో ప్రభుత్వం రూ.38 కోట్లతో పక్కా భవనాలు, సిబ్బందికి క్వార్టర్లు నిర్మించింది. ఈ గురుకుల్లాలోని బాలుర –1లో 238 మంది, బాలుర –2లో 457 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 100 మందికి పైగా ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ గురుకులాల సముదాయం పక్కనే కాగజ్‌నగర్ మున్సిపల్ డంపింగ్ యార్డు ఉండటంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

**భరించలేని కంపు వాసన..**
గురుకులాలకు పక్కనే డంపింగ్‌యార్డు ఉండడంతో కంపు వాసన భరించలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. చెత్తాచెదారానికి నిప్పంటించడంతో వచ్చే పొగతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, కళ్లకు మంటలు పుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సరిగా భోజనం కూడా చేయడం లేదని, కొన్ని సందర్భాల్లో వాంతులు కూడా అవుతున్నాయంటున్నారు. భవన సముదాయాల పక్కనే చెత్తకు నిప్పంటిస్తుండడంతో వచ్చే కాలుష్యంతో విద్యార్థులు వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. పొగతో శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవనాల సముదాయానికి దూరంగా డంపింగ్‌యార్డును తరలించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**వాసన వస్తుంది**



డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వాసన వస్తుంది. వర్షం కురిసినప్పుడు సమస్య మరింత తీవ్రమవుతుంది. వాసనను భరించలేకపోతున్నాం. భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. సరిగా భోజనం కూడా చేయడం లేదు.

- సాగర్, విద్యార్థి

**డంపింగ్‌యార్డు తరలించాలి**



డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పంటించిన సమయంలో పొగతో కళ్లల్లో మంటలు వస్తున్నాయి. దీంతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం. అధికారులు స్పందించి డంపింగ్ యార్డును పాఠశాల, కళాశాలకు దూరంగా తరలించాలి.

- సయ్యద్ సలీం, విద్యార్థి

## మోడల్ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి



శిక్షణ ఇస్తున్న ఎస్‌బీఎం కోఆర్డినేటర్

దహెగాం: ప్రతీ గ్రామ పంచాయతీని మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ వీవోలకు పారిశుద్య నిర్వహణపై మూడు రోజుల శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మోడల్ జీపీలుగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వాడకం, నీటి నిర్వహణ, గృహస్థాయి నుంచి కమ్యూనిటీ స్థాయిలో వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు ఫణికుమార్, సాయి క్రిష్ణ, రజినీకాంత్, ఈజీఎస్ ఏపీవో కల్పన, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన టేలా శ్రీను ఈనెల 8న ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సోమవారం పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి హనుమాండ్ల కేదారి, మాజీ అధ్యక్షులు సామల రాజన్న, రాపెల్లి సదానందం, సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, సుదర్శన్, జగదీశ్వర్, ఓంప్రకాశ్, సురవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలను ఉద్యోగులుగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

కౌటాల: హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. హమాలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని హమాలీలు ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ హమాలీలకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 25న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 27న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలన్నారు. హమాలీ కార్మికుల మండల అధ్యక్షులు పెరుగు విఠల్, మండల నాయకులు మడే పోషన్న, సురేశ్, దేవాజీ, సతీష్ పాల్గొన్నారు.

## శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్ మాట్లాడుతూ ఈ శోభాయాత్ర పట్టణంలోని బాలభారతి హనుమాన్ మందిర్ నుంచి ప్రారంభమవుతుందన్నారను. అనంతరం బాలభారతి పాఠశాల ఆవరణలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు హనుమంతరావు, రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ కరీంనగర్ విభాగ్ సేవ ప్రముఖ్ రంగస్వామి, కౌన్సిలర్ కీర్తి శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి కోశాధికారి లెక్కల మురళీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు రాజు, ఆంజనేయులు, సంతోశ్, నరేశ్ పాల్గొన్నారు.

### 'పాల్వాయి హరీశ్‌బాబు అరెస్టు అప్రజాస్వామికం'

రెబ్బెన: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల్లో అర్హులకు న్యాయం జరగలేదని ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబును పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నిరసన తెలిపేందుకు వెళ్తున్న హరీశ్ బాబును అరెస్టు చేసి బలవంతంగా వాంకిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు అరెస్టు చేసిన హరీష్‌బాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



నిరసన తెలుపుతున్న శ్రీనివాస్, నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపుమేరకు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అన్యాయం చేసి అనర్హులకు ఉద్యోగాలిప్పిస్తున్న కేటీఆర్‌ను తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులను వంచించిన కేసీఆర్ ప్రభుత్వం 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్అర్బన్: ట్రాన్స్‌కోకు సంబంధించిన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ 132 కేవీ టవర్ లైన్‌లో మెయింటనెన్స్‌లో పనులు ఉన్నందున నేడు (మంగళవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ప్రసాద్, ఏడీఈ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నందున వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

### వారసంతలో అన్నదానం

కౌటాల: మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనం ఎదుట సోమవారం శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సోమవారం జరిగే వారసంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 'కంటి వెలుగు'పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే
- పల్లెప్రకృతి వనం, వెల్‌నెస్ సెంటర్ల పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే అన్నారు. సోమవారం మండలంలోని సలుగుపల్లి గ్రామపంచాయతీలో చేపట్టిన పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. వనంలోని కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ధర్మయ్యను ఆదేశించారు. నీడనిచ్చే చెట్లతో పాటు పూల మొక్కలు పెంచాలని సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఎంఎల్‌హెచ్‌పీ భానుప్రియ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి భవనం మంజూరైనా స్థలం సమస్య ఏర్పడిందని, గ్రామపంచాయతీ భవనంలో కొనసాగిస్తున్నట్లు ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భవనానికి స్థలం కేటాయించడంతో పాటు జీపీలో కాలువల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ విమల కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీపాల్, ఎంపీవో రమేశ్ రెడ్డి, ఏపీవో చంద్రయ్య, ఆర్ఐ అమృతరావు తదితరులు ఉన్నారు.

**వంతెన పనులు వేగవంతం చేయాలి**
కాగజ్‌నగర్‌రూరల్: జూన్‌లోగా అందవెల్లి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దయ్య, డీఈఈ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ప్రమోద్, ఆర్‌అండ్‌బీ ఏఈ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి**
ఆసిఫాబాద్: జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు బొర్కడే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు, డీఆర్వో రాజేశ్వర్‌తో కలిసి ఆధార్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మీసేవా కేంద్రాలు, బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల ద్వారా ఆధార్ నమోదును వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నమోదు ప్రక్రియకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ సుభాన్, ఈడీఎం గీతం, డీఈవో అశోక్, డీపీఆర్వో కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### హిందూ ఉత్సవ సమితి కార్యవర్గం ఎన్నిక

రెబ్బెన: గోలేటిటౌన్‌షిప్‌లోని కోదండ రామాలయం ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గోలేటి పట్టణ హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమితి గౌరవ అధ్యక్షుడిగా గుల్బం చక్రపాణి, అధ్యక్షుడిగా గోలేం విలాస్, ఉపాధ్యక్షులుగా కోరుట్ల యాదగిరి, బత్తిని రమేష్, దుర్గం వసంతరావు, లేకూరి సుధాకర్, మోసం గోపాల్, ప్రధాన కార్యదర్శిగా యంసాని సతీష్, కార్యదర్శులుగా నర్సయ్య, కిరణ్, నాగేందర్, కోట సుభాష్, మడావి సురేష్, కోశాధికారిగా అల్లాడి విశ్వేశ్వర్, సలహాదారులుగా శ్రీనివాస్‌రావు, రాజాబాబు, సదాశివ్, వీరస్వామి, దుప్పానాయక్, సాంబాగౌడ్, సంతోష్ శర్మ, లక్ష్మణాచారి, సోషల్ మీడియా కన్వీనర్‌గా రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

### కైరిగూడ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ వెళ్లే దారిలో పావురాల గుట్ట వద్ద దెబ్బతిన్న రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం పావురాల గుట్ట వద్ద రోడ్డును పరిశీలించారు. జీఎం కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు, సేఫ్టీ కమిటీ సభ్యులు కిరణ్ పాల్గొన్నారు.

### కుష్టు నిర్మూలనకు కృషి

కౌటాల: కుష్టు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీపీఎంవో సీహెచ్ రమేష్ అన్నారు. కుష్టువ్యాధి నివారణ చర్యలపై సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చికిత్సతో కుష్టును నయం చేయవచ్చన్నారు. శరీరంపై మచ్చలు, చర్మం రంగు మరినా స్థానిక పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అధికారి రాజేందర్, హెల్త్ సూపర్‌వైజర్ పావని, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మజ్లిస్ పార్టీ మండల అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆరీఫ్, హష్మీ, పాషా, షకీల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్, సెర్ప్ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని 149 మంది సెర్ప్ ఉద్యోగులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. సెర్ప్ సంఘాల జేఏసీ కన్వీనర్ రమేష్, కో కన్వీనర్ వెంకటరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఎంలు అన్నాజి, యాదగిరి, సారయ్య, యశోద, విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.